# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **హైదరాబాద్ నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయాలే కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ రోజు జరగనుంది.**

4. **'హనుమాన్' ప్రాజెక్ట్ లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.**

===========================

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఆంధ్రప్రదేశ్ ఒక మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి అనేది ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని పెద్దకాకానిలో ఒక ప్రైవేటు కంటి ఆసుపత్రిలో అదనపు భవనాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

హైదరాబాద్ నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయాలే కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన పలు అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో నిన్న నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

..వాయిస్..24 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ

శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం పర్యటనలో భాగంగా.. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, అర్హులందలందరికీ పింఛన్లు, కౌలు రైతులకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 'మొంథా తుఫాను' ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందాలు ఈరోజు నుంచి రెండు రోజుల పాటు పర్యటించనున్నాయి. ఈ రోజు బాపట్ల జిల్లాలో ఒక బృందం, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో మరొక బృందం పర్యటించి తుఫాను కారణంగా జరిగిన పంట, ఆస్థి నష్టాన్ని పరిశీలించనున్నాయి. రేపు ఒక బృందం ప్రకాశం, మరో బృందం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి నష్టాన్ని పరిశీలిస్తాయి. పరిశీలన పూర్తయిన అనంతరం రేపు సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈ బృందాలు సమావేశం కానున్నాయి.

---------------------------

సమాజంలో న్యాయ సేవలు పొందలేకపోతున్న వారిని గుర్తించి, సేవలు అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు సఫలీకృతమయ్యాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 7వ అదనపు న్యాయమూర్తి జస్టిస్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఉచిత న్యాయ సేవలను సమాజంలో మారుమూల జీవిస్తున్న ప్రజలకు చేరువ చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పలమనేరులో కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ నిన్న ప్రారంభించారు. అనంతరం అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'హనుమాన్' (Healing And Nurturing Units for Monitoring, Aid & Nursing of Wildlife) ప్రాజెక్ట్ సంబంధించిన పోస్టరును ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. నిర్ణీత వ్యవధిలో 'హనుమాన్' ప్రాజెక్ట్ లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలను రూపొందించాలని, నవంబరు 18, 19 తేదీల్లో 'హనుమాన్' ప్రాజెక్ట్ పై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. అటవీ, పర్యాటకం, వ్యవసాయం, ఉద్యాన శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఈరోజు జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మంత్రి మండలి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌తో పాటు మంత్రులు పాల్గొంటారు. ఈ సమావేశంలో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సు, రాష్ట్రంలోని జిల్లాల పునర్వ్యవస్థీకరణ, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మొంథా తుఫాన్ వల్ల పంట నష్టం, సహా పలు కీలక అంశాలు చర్చించనున్నారు. 12వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో అనుమతించిన లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్న సంస్థలకు భూముల కేటాయింపుపైనా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

---------------------------

యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా ప్రకాశం జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ ను నిర్మించామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. జిల్లాలోని జి.లింగన్నపాలెంలో.. ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్‌ను రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కేంద్రంలో నేటి నుంచి రెండు రోజుల పాటు వాటర్‌షెడ్ మహోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర వాటర్ షెడ్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖ కుమార్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్‌షెడ్ - ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన - పీఎంకెఎస్‌వై జాతీయ సదస్సు గుంటూరులో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రేపు వెంగళాయపాలెం పంచాయతీలో జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన రెవెన్యూ క్రీడా ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా అనంతపురం జిల్లా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఎస్. సవిత విజేతలకు బహుమతులు అందజేశారు. నగరంలోని ఆర్‌డిటి క్రీడా గ్రామంలో ఈ నెల 7న ప్రారంభమైన క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో 26 జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

---------------------------

ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలిపారు.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడాతయని, చలి పెరిగే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

======================